సమాచారం ఆలస్యం..!



- సమస్యల్లో సమాచారహక్కు చట్టం
- కమిషనర్ల నియామకంలో నిర్లక్ష్యం
- హైకోర్టు ఆదేశించినా చర్యలు శూన్యం
- పెండింగ్‌లో 40వేల అర్జీలు



బెంగళూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ శాఖలకు సంబంధించి దేశంలో ప్రతి పౌరుడు తన సందేహాలను నివృత్తి చేసుకోవడంతోపాటు లోపాలను తెలుసుకునేందుకు వీలుగా ఓ ఆయుధంలా సమాచారహక్కు చట్టాన్ని తీసుకొచ్చారు. దేశవ్యాప్తంగా చట్టాన్ని అమలు చేసేలా కఠినమైన ఆంక్షలు విధించారు. ఏశాఖకు సంబంధించిన అంశాలనైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా అందించాల్సి ఉంటుంది. సమాచారం అందించని పక్షంలో సంబంధింత అధికారిపై చర్యలు, ఇతరత్రా ఆంక్షలు ఉన్నాయి. సమాచార హక్కు చట్టం ద్వారా ఎన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడక్కడ ఈ చట్టంతోనే కొందరికి వేధింపులు వచ్చినా ఎక్కువశాతం మందికి సమగ్ర సమాచారం చట్టం ద్వారా లభించింది. అయితే చట్టాన్ని అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది.

వందల్లో అర్జీలు పెండింగ్..

అర్జీలు కర్ణాటక సమాచార హక్కు కమిషన్‌కు వచ్చి పడుతున్నాయి. వావివిధ ప్రభుత్వశాఖలనుంచి సమగ్ర సమాచారం లభించడం లేదని రోజూ వందలకొలదీ అర్జీలు కర్ణాటక సమాచార హక్కు కమిషన్‌కు వచ్చి పడుతున్నాయి. వాటిని పర్యవేక్షించాల్సిన కమిషన్ కార్యాలయంలో కమిషనర్ లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అమలు చేసిన కీలకమైన చట్టాల్లో సమాచార హక్కుచట్టం ఒకటి. మరో ఏడాది గడిస్తే చట్టాన్ని అమలులోకి తెచ్చి రెండు దశాబ్దాలు కానుంది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సమాచార హక్కు కమిషనరేట్ పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ ఖాళీగా ఉండే కమిషనర్ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం వెనుకడుగు వేస్తోంది. ఏకంగా 40వేలకుపైగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఫిర్యాదుదారులు సమాచారం కోసం నెలలనుంచి సంవత్సరాలపాటు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన కమిషనర్‌తోపాటు ఖాళీగా ఉండే ఏడుగురు సమాచార కమిషనర్ల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. ఈ కారణాలతో రోజురోజుకు పిటిషన్‌లు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న ఇద్దరు కమిషనర్లపై ఒత్తిడి పెరుగుతోంది. వారి పాలనా వ్యవధి కూడా మరో ఐదు నెలల్లో ముగియనుంది. ఖాళీగా ఉండే పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా లేదు. మరి కొన్ని నెలల్లో ఖాళీ అయ్యే పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారో అనేది స్పష్టత లేకుండాపోతోంది.

కీలక పోస్టులు ఖాళీ

సమాచార హక్కు కమిషన్‌లో చీఫ్‌కమిషనర్‌తోపాటు 10మంది కమిషనర్ల పోస్టులు ఉన్నాయి. వీటిలో బెళగావి, కలబురగిలకు ఒక్కో పోస్టు ఉంది. చీఫ్ కమిషనర్‌తోపాటు మరో ఆరుగురి కమిషనర్ పోస్టుల నియామకానికి అవసరమైన ప్రాథమిక ప్రక్రియను పాలనా వ్యవహారాలశాఖ పూర్తి చేసింది. ఏడు పోస్టులకుగాను 2,500మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. డీపీఏఆర్ జాబితాలో అర్హత కల్గినవారిని షార్ట్‌లిస్ట్‌కు పంపింది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన గతంలో రెండుసార్లు కమిషనర్‌ల నియామకానికి సంబంధించి సమావేశం జరిగింది. అయితే అంతిమ నిర్ణయం తీసుకోలేకపోయారు. ఎంపిక కమిటీ కూడా నాలుగు నెలలక్రితమే తుది జాబితాను ఖరారు చేసిందని కానీ వివిధ కారణాతో వాయిదా పడుతున్నట్లు తెలుస్తోంది. కమిషనర్ నియామకం విషయంలో ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. మాజీ ఐపీఎస్, ఐఏఎస్‌తోపాటు మాజీ జడ్జిలు, ప్రభుత్వాధికారులు పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఎవరికి అవకాశం ఇచ్చినా మరొకరినుంచి ఇబ్బంది వస్తుందనే వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

హైకోర్టు ఆగ్రహం



సమాచారహక్కుచట్టం బెళగావి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న బీవీ గీత 2022 ఏప్రిల్‌లో కేపీఎస్ సీ సభ్యురాలిగా నియామకం కావడంతో పోస్టు ఖాళీ అయ్యింది. ఇప్పటివరకు అక్కడ కమిషనర్ పోస్టును భర్తీ చేయలేదు. బెళగావి పరిధిలోని జిల్లాల్లో సుమారు 15వేల అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్టు ఇటీవల శాసనసభ శీతాకాల సమావేశాలలో తెలిసింది. గతవారం సమాచార హక్కు కమిషన్ జరిమానా విధించిన విషయమై విచారణ వేళ హైకోర్టు ధర్మాసనం ముందుగా సమాచార హక్కు కమిషన్‌కు సంబంధించి కమిషనర్‌లను నియమించాలని ప్రభుత్వానికి సూచించింది. ఇలా ఎంతకాలం భర్తీ చేయకుండా జాప్యం చేస్తారని తీవ్రంగా స్పందిస్తూ మార్గదర్శకాలు చేసింది. సుప్రీంకోర్టు కూడా రాష్ట ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమాచార కమిషన్ పోస్టులను ఖాళీగా ఉంచరాదని ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని స్పష్టం చేశారు. కాగా పాలనలో పారదర్శకత, అవినీతి నియంత్రణకోసం ప్రజలకు అనుకూలంగా ఉండాలని తీసుకొచ్చిన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయరాదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్థివదేహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం సిద్దరామయ్య

మన్మోహన్‌సింగ్‌కు సీఎం నివాళి

బెంగళూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు సీఎం సిద్దరామయ్య నివాళి అర్పించారు. శనివారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ పార్థివదేహాన్ని సీఎం సందర్శించి పుష్పాంజలి ఘటించారు. డీసీఎం డీకే శివకుమార్, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

నూతన సంవత్సర వేడుకలు

రాత్రి ఒంటిగంట వరకే

- మెట్రో సంచారం ఉండదు... ఫ్లై ఓవర్ల మూసివేత
- నగర కమిషనర్ దయానంద్



బెంగళూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు రాత్రి ఒంటి గంట వరకే జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని బెంగళూరు నగర పోలీసు కమిషనర్‌దయానంద్ తెలిపారు. శనివారం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. ఈనెల 31న మంగళవారం ఏడాది ముగింపు వేడుకలు రాత్రి ఒంటి గంట వరకూ మాత్రమే పరిమితం చేశామన్నారు. పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లు ఒంటిగంటకు మూసివేయాలని ఆదేశించామన్నారు. ఎయిర్‌పోర్టు రోడ్‌తో పాటు నగర పరిధిలోని అన్ని ఫ్లైఓవర్‌లను మూసివేస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు ఇష్టారాజ్యంగా తిరగకుండా కట్టడి చేస్తామన్నారు. నగర పరిధిలో ఎటువంటి హింసాత్మకం, ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే ముగ్గురు విదేశీ డ్రగ్‌పెడ్లర్‌లతో పాటు 70మందిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెంగళూరు శివారు ప్రాంతాల్లో రేవ్ పార్టీలపైనా నిఘా ఉంటుందన్నారు. ఎంజీ రోడ్, బ్రిగేడ్, కోరమంగల, ఇందిరానగర్‌లలో ఎక్కువ మంది ప్రజలు చేరుతున్నందున సేఫ్టీ ఐలాండ్, సీసీ టీవీలతో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. బ్రిగేడ్, ఎంజీ రోడ్‌లలో ఒక వైపు మాత్రమే సంచరించేందుకు వీలుంటుందని రాత్రి 11గంటల తర్వాత ఎంజీ రోడ్ మెట్రో స్టేషన్‌ను మూసివేస్తామన్నారు. కానీ మెట్రో సేవలు రాత్రి 2 గంటలకు కొనసాగుతాయని మెట్రో కార్పొరేషన్ ప్రకటించింది. మెజస్టిక్ నుంచి రాత్రి 2.40 గంటలకు చివరి మెట్రో రైలు బయలుదేరనున్నట్లు ప్రకటించారు. గతంలో ఏడాది ఆఖరు రోజున చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

కైవార తాతయ్యకు విశేష పూజలు

చింతామణి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార గ్రామంలోని యోగి నారేయణ తాతయ్యమఠంలోని తాతయ్య మూర్తికి శనివారం విశేషపూజలు నిర్వహించారు. మార్గశిర మాసం చివరి శనివారం పురస్కరించుకుని అభిషేకం, విశేష పూజలు, పుష్పాలంకరణ చేశారు. రామ రామ ముకుంద మాధవ అనే కైవారతాతయ్య శ్రీరామ భవతారక మంత్రాన్ని 108 సార్లు జపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అలంకరణలో యోగినారేయణ తాతయ్య

ఎగరని విమానాలు..!

- వెలవెలబోతున్న గుల్బర్గా విమానాశ్రయం
- నెలలో 200 నుంచి 26కి పడిపోయిన ప్రయాణాలు

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):కళ్యాణ కర్ణాటకలో ఉన్న అతి కొద్ది ఎయిర్ పోర్టుల్లో గుల్బర్గా(కలబుర్గి) ఒకటిగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు నెలలో 200 వరకు విమాన ప్రయాణాలతో కిటకిటలాడిన ఈ ఎయిర్ పోర్టు ప్రస్తుతం నెలలో కేవలం 26 ప్రయాణాలకే పరిమితం అయ్యింది. 2019లో ప్రజలకు విమానయాన సేవలు కల్పించే ఉద్దేశంతో గుల్బర్గా విమాన యాన సేవలు ప్రారంభం అయ్యాయి. గుల్బర్గా ఎయిర్ పోర్టుకు ఇతర నగరాల నుంచి వచ్చే విమానాలు, ప్రయాణికుల సంఖ్య నెలనెలా క్షీణిస్తోంది. భారతీయ విమానయాన సంస్థ(ఏఏఐ) సర్వే ప్రకారం గుల్బర్గా ఎయిర్ పోర్టులో 2021లో గరిష్టంగా 2,157 విమానాలు వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే 2024 సంవత్సరంలో 11 నెలల్లో వాటి సంఖ్య 1,177కు పడిపోయింది. ఈ దిశలో దాదాపు 54శాతం విమానాలు రాకపోకలు తగ్గినట్లు ఎయిర్ పోర్టు అథారిటీ పేర్కొంటోంది. దీంతో పాటు ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. 2021సంవత్సరంలో 88,474మంది ప్రయాణికులు గుల్బర్గా ఎయిర్ పోర్టును ఉపయోగించుకున్నారు. అయితే 2024 సంవత్సరంలోని 11 నెలల్లో ప్రయాణికుల సంఖ్య 39,434కి పడిపోయింది. అదేవిధంగా 2022మార్చి నెలలో 190 విమానాలు గుల్బర్గా ఎయిర్ పోర్టుకు రాగా, అందులో 9,117 మంది మాత్రమే ప్రయాణించారు. ఈ నెలలో మాత్రమే అతి ఎక్కువగా విమానాల్లో ప్రయాణించినట్లు తెలుస్తోంది. సామాన్య రోజుల్లో అతి తక్కువ మంది అంటే 2024, నవంబరు నెలల్లో 1,040 ప్రయాణించగా, (కోవిడ్ సమయంలో 2020 మే నెలలో 20 విమానాలు ద్వారా కేవలం 391 ప్రజలు మాత్రమే విమాన సేవలు ఉపయోగించుకున్నారు.



గుల్బర్గా ఎయిర్‌పోర్టు ప్రధాన ద్వారం

బెంగళూరుకే పరిమితమైన విమాన యాన సేవలు: ఢిల్లీ, ముంబై, తిరుపతి, హైదరాబాద్ లాంటి నగరాలకు గుల్బర్గా ఎయిర్ పోర్టు నుండి సేవలు నిలిపి వేయడంతో ప్రస్తుతం గుల్బర్గా ఎయిర్ పోర్టు నుండి బెంగళూరుకు వరకు విమాన సేవలు నడుస్తున్నాయి. అందుకు గాను స్టార్‌ఎయిర్ విమానం ఒక్కటే వారంలో సోమవారం, గురువారం, శనివారం రోజుల్లో నడుపుతుండడం గమనార్హం. దక్షిణ గోవా దాబోలియ్ విమానాశ్రయం, గుల్బర్గా మధ్య విమాన యాన సేవలు అందించేందుకు అలయన్స్ ఎయిర్ సంస్థ ముందుకకు వచ్చింది. అయితే కేరళరాజకీయ ప్రముఖులు ఒకరు తమ రాజకీయ ప్రాభల్యంతో గుల్బర్గాకు రావాల్సిన విమాయాన సేవలను కొచ్చిన్-సేవలం మధ్య నడిచేలా చేసుకున్నట్లు సమాచారం. దీంతో పాటు అలయన్స్ ఎయిర్ సంస్థ సంపర్క యోజనలో(ఆర్‌సిఎస్, ఉడాన్) సేవల క్రింద మాత్రమే ప్రస్తుతం గుల్బర్గా ఎయిర్‌పోర్టులో సేవలు అందుతున్నట్లు విమానయాన సంస్థలో పనిస్తున్న అధికారి తెలిపారు. గుల్బర్గా ఎయిర్‌పోర్టు నుండి ఇతర ప్రముఖ నగరాలకు సేవలు విస్తరించాలని ఎయిర్ పోర్టు అథారిటీ అధికారులకు లేఖ రాసినా స్పందన లేదని గుల్బర్గా ఎయిర్‌పోర్టు డైరెక్టర్ చిలకా మహేష్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇక్కడి నేతలు, ప్రభుత్వ పెద్దలు కళ్యాణ కర్ణాటకపై ఆసక్తి చూపి విమాన సర్వీసులు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఐశ్వర్యగౌడ దంపతుల అరెస్టు

- మాజీ ఎంపీ డీకే సురేశ్ చెల్లెల్ని అంటూ రూ.8 కోట్ల బంగారు తీసుకెళ్లిన కేసు..

బెంగళూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ డీకే సురేశ్ చెల్లెలుగా పరిచయం చేసుకుని కోట్లాది రూపాయల బంగారంతో మోసం చేసిన మహిళను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారాహి వరల్డ్ ఆఫ్ గోల్డ్‌షాప్‌లో 8.41 కోట్ల రూపాయల విలువైన బంగారాన్ని తీసుకెళ్లినట్లు యజమాని ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు చంద్రాలే అవుట్ పోలీసులు ఐశ్వర్యగౌడతోపాటు భర్త హరీశ్‌ను అరెస్టు చేశారు. కాగా ఐశ్వర్యగౌడ విజయనగరకు చెందిన డాక్టర్ గిరీశ్, డాక్టర్ మంజుళ దంపతులకు 2022లో విలాసవంతమైన లగ్జరీకార్లను కొనుగోలు చేయిస్తానని రూ.6.2 కోట్లు మోసం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. రెండింటిపైనా పోలీసులు సీరియస్‌గా భావించారు. మరోవైపు ఇదే విషయమై స్పందిస్తూ శనివారం మాజీ ఎంపీ డీకే సురేశ్ ఎవరో నా పేరు చెప్పుకొని మోసం చేస్తున్నారన్నారు. నగర పోలీస్ కమిషనర్‌కు లేఖ రాస్తానని వెల్లడించారు.

భయం..భయం..!

- ఆందోళనలో గర్భిణులు
- ఆగని బాలింతల మరణాలు
- విజయనగర జిల్లాలో మరో ఇద్దరి మృతి
- హోటల్లో ఇడ్లీ తిన్నందుకే అంటున్న వైద్యులు



ఐశ్వర్య (ఫైల్)


బళ్లారి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భిణులకు కాన్పుల భయం వీడలేదు. నవమాసాలు మోసి ప్రసవానికి వచ్చిన తల్లులు మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. గత నెలలో బళ్లారిలో జరిగిన బాలింతల మరణాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. దుర్ఘటన మరిచిపోక ముందే రెండ్రోజుల క్రితం విజయనగర (హోస్పేట్)లో ఇద్దరు బాలింతలు మృతి చెందారు. బళ్లారి జిల్లా సండూరు తాలూకా ఇంగల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య అనే గర్భిణీ విజయనగర జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి డిసెంబరు 20న కాన్పు కోసం చేరింది. ఆమెకు ఈ నెల 24న సిజేరియన్ చేసి కాన్పు చేశారు. తరువాత ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం కావడంతో ఆమెను కొప్పళ జిల్లాకు వైద్యం కోసం తరలించారు. చికిత్స పొందతూ ఆమె శుక్రవారం రాత్రి మరణం చెందారు. బాలింత మరణంతో బంధవులు, ఆందోళన వ్యక్తం చేశారు. అయితే జిల్లా వైద్యధికారి బాలింత మృతికి బయట హోటల్ నుంచి తెచ్చిన ఇడ్లీలే కారణమని ప్రకటించారు. కలుషితమైన ఆహారం తినిపించారని, అందుకే ఘటన జరిగిందని పేర్కొంటున్నారు. మరో బాలింత పూజ కూడా కాన్పు తరువాత మరణం చెందారు. ఈమెకు కాన్పు తేదీ కన్నా ముందే సిజేరియన్ చేయడం వల్ల మృతి చెందిందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇద్దరు బాలింతల మృతితో మరోసారి జిల్లాలో ఆందోళన మొదలయ్యింది.

అమాయకుల ప్రాణాలు తీసిన

అక్రమ రవాణా

- రేషన్ తరలిస్తున్న ఆటో బోల్తా
- బస్తాలు మీద పడి ఇద్దరు కూలీల మృతి
- మృతదేహాలను వదిలేసి.. బియ్యం తరలింపు
- కేసు నమోదు చేయని పోలీసులు

8





ఉమ్మడి జిల్లా పారిశ్రామిక ప్రగతిలో మణిపూస కియ. ఈ అంతర్జాతీయ కార్ల ఫ్యాక్టరీ గత టీడీపీ పాలనా కాలంలో జిల్లాలో స్థాపించబడింది. దీని ద్వారా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. కియతో స్ఫూర్తి పొంది, ఇతర పరిశ్రమల పెట్టుబడులు వస్తున్న తరుణంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ పారిశ్రామిక రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్- 2023 ద్వారా జిల్లాకు పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వస్తాయని, ఆమేరకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదిరాయని నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాలో పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు చేసి, శిలాఫలాలు వేసి హామీల గారడీ చేశారు. అయితే కొత్తగా ఒక్క ఫ్యాక్టరీ కూడా జిల్లా వైపు చూడలేదు. ఇలా ఈఏడాది మొదటి ఐదురు నెలల్లో పారిశ్రామిక రంగం నేలచూపులు చూసింది. టీడీపీ హయాంలోనే పాలసముద్రం వద్ద 503 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నాసిన్ సంస్థను ప్రధాని మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలు జనవరి 16న ప్రారంభించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సముదాయం (భెల్) నత్తనడకన సాగింది. ఇలా వైసీపీ పాలనలో పారిశ్రామిక ప్రగతి జిల్లాలో కుంటుపడింది. అయితే కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో జిల్లా పారిశ్రామిక ప్రగతిపై ఆశలు చిగురించాయి. గడచిన ఆరున్నర నెలల్లో జిల్లాలో పారిశ్రామిక పురోగతికి కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈక్రమంలో పారిశ్రామికవేత్తలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి/ అనంతపురం అర్బన్



నాసిన్‌ను ప్రారంభిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తదితరులు (ఫైల్)

ప్రగతి పరుగులు

జిల్లా పారిశ్రామికరంగానికి పూర్వ వైభవం

- ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
- జిల్లాకు టెస్లాను ఆహ్వానించిన మంత్రి లోకేశ్
- కూటమి ప్రభుత్వం రాకతో పారిశ్రామికవేత్తల్లో ఉత్సాహం
- అనంతలో విమానాశ్రయం ఏర్పాటుకు ఆలోచన
- వైసీపీ పాలనలో హడావుడి తప్ప కానరాని అభివృద్ధి
- 2024లో పారిశ్రామిక వెలుగు నీడల రౌండప్

4.0 పాలసీతో పారిశ్రామిక వెలుగులు

అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0 తీసుకువచ్చింది. జిల్లాలకు జాతీయ రహదారుల అనుసంధానం, విస్తీరణతోపాటు జాతీయ రహదారుల వెంట పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి బాటలు పడ్డాయి. పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటించారు. విద్యుత్ వాహనాల (ఈవీలు) బ్యాటరీలను తయారు చేసే పరిశ్రమ పెట్టాలని దిగ్గజ సంస్థ టెస్లాను ఉమ్మడి జిల్లాకు ఆహ్వానించారు. 2014-19లో టీడీపీ హయంలోనే కియ, బెల్, నాసిన్ ఏర్పాటుతో శ్రీసత్యసాయి జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా, పారిశ్రామిక కారిడార్‌గా అవతరించింది. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం జిల్లా పారిశ్రామిక ప్రగతికి బాటలు వేసింది. జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు రహదారులు అభివృద్ధి, అనుసంధానం, ఎయిర్ కనెక్టివిటీకి శరవేగంగా అడుగులేస్తోంది. కియ సంస్థకు అనుబంధంగా మరిన్ని పరిశ్రమల ఏర్పాటుతోపాటు జిల్లాలోను ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించారు. జిల్లాలో చిలమత్తూరు, మడకశిరలో పారిశ్రామిక కస్టర్ ఏర్పాటు, పారిశ్రామిక జిల్లా సమీక్ష సమావేశాలు, ఔత్సాహికుల ఆకర్షణతోపాటు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఈ ఆరునెలల్లో రూ. 1239 కోట్ల పెట్టుబడులతో 4049 మందికి ఉపాధి కల్పన దిశగా 32 పరిశ్రమలకు 1056 ఎకరాల భూముల కేటాయింపులు చేశారు.



మడకశిరలో కేఎస్ఎస్ఎల్‌కు భూములు కేటాయింపు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు ఒకటిన మడకశిర ప్రాంత పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగుల మందుగుండు సామగ్రి తయారు చేసే పరిశ్రమ అయిన భారత్ ఫోర్జ్‌కు అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్)కు భూములు కేటాయించారు. ఈ సంస్థ మొదటి దశలో రూ.1430 కోట్లుతో పెట్టుబడి పెట్టనుంది. మొదటి దశలో 565 మందికి ఉపాధి లభించనుంది. అలాగే మడకశిర మండలం బుల్లసముద్రం, హరేసముద్రం, మనూరు, కల్లుమర్రి గ్రామాల పరిధిలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్క్ ఏర్పాటుకు సోలార్ పరిశ్రమలు ముందుకువచ్చాయి. ఇలా మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు 3043ఎకరాల భూములను సిద్ధం చేశారు. మడకశిర ప్రాంత వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు అమరాపురంలో వక్క మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంజూరు చేసి స్థల పరిశీలన చేశారు.

చిలమత్తూరులో పారిశ్రామిక క్లస్టర్

కర్ణాటక సరిహద్దు టేకులోడులో 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టేకులోడు వద్ద ఇప్పటికే 225 ఎకరాల్లో ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తోంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 3.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో తాగునీటి ప్రత్యేక పైపులైన్ నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయి. ఇక్కడే మరో 880 ఎకరాల భూములు సేకరించడానికి ఏపీఐఐసీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. పుట్టపర్తిలో రూ.ఏడు కోట్లతో కప్పలబండ పారిశ్రామిక పార్కులో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవల రాష్ట్ర సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాలో పర్యటించి జిల్లాలో పారిశ్రామికవాడతోపాటు ఎంఎస్ఎంఈ పార్కుల పురోగతిపై సమీక్ష చేపట్టారు. ఈనేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టనుంది.



టేకులోడు పారిశ్రామిక పార్కు

అనంత జిల్లాలో...

అనంతపురం జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ఏడాది ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే 2023 -2027 పాలసీని రద్దు చేశారు. ఈ ఏడాది అక్టోబరులో 2024- 2029 కొత్త పరిశ్రమల పాలసీని ప్రవేశపెట్టారు. అక్టోబరు 24 నుంచి కొత్త పాలసీ అమలవుతుంది. ఆ మేరకు జీవో జారీ చేశారు. త్వరలోనే గైడ్‌లైన్స్ జారీ చేసి, పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారు.

జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు యోచన



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు,అంబికా, బీకే, మంత్రి కేశవ్ (ఫైల్)

జిల్లా నుంచి ఉద్యాన పంటల ఎగుమతి కోసం విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. ఈ ఏడాది జూలై నెలలో జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఉమ్మడి అనంత జిల్లా ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఏవియేషన్ ట్రైనింగ్ కోసం కృషి చేయాలని కోరారు. ఇదే అమలైతే దక్షణాదిలోనే మొట్టమొదటి ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతి కేంద్రంగా, విమానాశ్రయంగా జిల్లా గుర్తింపు పొందనుంది.



ఎన్నికల ముందు వర్చువల్‌గా కలెక్టరేట్‌లో అప్పటి సీఎం జగన్ ఆవిష్కరించిన పరిశ్రమల శంకుస్థానం శిలాఫలకం

ఎన్నికల ముందు హడావుడి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి పేరుతో అప్పటి ముఖ్యమంత్రి జగన్ పారిశ్రామిక అభివృద్ధి డ్రామాకు తెర తీశారు. హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేశారు. వర్చువల్ విధానం ద్వారా కదిరి మండలం పట్నంలో రూ.4,41 కోట్లతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్, సోమందేపల్లి గుడిపల్లి వద్ద రూ. 125 కోట్లతో యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమేటివ్ ప్లాస్టిక్ ప్రైవేట్ కంపెనీ, మడకశిర మండలం ఆర్ అనంతపురం వద్ద రూ.250 కోట్లతో ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ కంపెనీల పనులకు సీఎం హోదాలో భూమి పూజ చేశారు. ఈమూడు పరిశ్రమలు ఏడాదిలో ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా 1370 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని గొప్పగా చెప్పారు. ఈక్రమంలోనే పుట్టపర్తి జిల్లా కేంద్రం కప్పలబండ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రూ. 11.71 కోట్లు, హిందూపురం పారిశ్రామికవాడకు రూ7.15 కోట్ల నిధులు మంజూరు చేశారు. పారిశ్రామిక వాడల్లో సూక్ష్మ, చిన్న తరహా సంస్థల అభివృద్ధి కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వివిధ కంపెనీల ఏర్పాటుకు ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. ఇవేవి ఒక్క అడుగు ముందుకుసాగకపోగా వర్చువల్ శంకుస్థాపనలకే పరితమయ్యాయి. పెనుకొండ, గుడిపల్లి, గోళ్లాపురం, ఎర్రమంచి, రాళ్లఅనంతపురం, కొటిపి, కదిరి కూటగూళ్ల, శెట్టిపల్లి, దాదలూరు, కేతగానిచెరువు, కప్పలబండ వద్ద పారిశ్రామిక పార్కులతోపాటు భూములు సిద్ధంగా ఉన్నా ఈభూముల్లో వైసీపీ ప్రభుత్వం ఎక్కడా ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయింది.

పారిశ్రామికవేత్తలకు వైసీపీ మొండిచేయి

పారిశ్రామికవేత్తలకు వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపింది. 2021 సెప్టెంబరు మాసం నుంచి గత ఏడాది మంజూరైన పరిశ్రమలు, పలు రకాల వాహనాలకు అందాల్సిన సబ్సిడీ డబ్బులను ప్రభుత్వం ఆపేసింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, జగనన్న బడుగు వికాసం పథకాలకు సంబంధించి సేవా రంగం, ఉత్పత్తి రంగాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలతోపాటు పలు రకాల వాహనాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బులు చెల్లించలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ సర్కార్ నిర్వాకంతో జిల్లా వ్యాప్తంగా 595 యూనిట్లకు సంబంధించిన రూ.70 కోట్లకుపైగా సబ్సిడీ మొత్తం పెండింగ్‌లో ఉండిపోయింది.



వైసీపీ ఐదేళ్ల పాలనలో కప్పలబండ పారిశ్రామిక వాడ ఇలా..

2023-27 పాలసీ ఆలస్యంగా అమలుతో అన్యాయం

గత ప్రభుత్వం 2023- 2027 పారిశ్రామిక పెట్టుబడి పాలసీని ఆలస్యంగా అమలు చేయడంతో తీవ్ర అన్యాయం జరిగింది. 2023 ఏప్రిల్ నుంచి కొత్త పాలసీని అమలు చేయాల్సి ఉంది. అయితే అప్పట్లో కేవలం సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. గైడ్‌లైన్స్, జీవోలను విడుదల చేయడంలో జాప్యం చేసింది. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం లేకుండా పోయింది. ఈ ఏడాది జనవరి మొదటి వారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పాత వారికే సబ్సిడీ డబ్బులు ఇవ్వని ప్రభుత్వం కొత్త వారికి ఎప్పుడు ఇస్తుందన్న అభద్రతా భావంతో అనేక మంది కొత్తగా పరిశ్రమలు, ట్రాన్స్‌పోర్టు యూనిట్లకు దరఖాస్తు చేసుకునేందుకు వెనుకంజ వేశారు.



ఆరునెలల్లో కప్పలబండ పారిశ్రామిక పార్కు విస్తరణ దిశగా కూటమి ప్రభుత్వం

కొత్త పారిశ్రామిక వాడల ఏర్పాటుకు చర్యలు

వైసీపీ ప్రభుత్వం పారిశ్రామిక వాడల ఏర్పాటును పూర్తిగా విస్మరించింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే ఉమ్మడి అనంత జిల్లాలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసి పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేలా నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు, మడకశిరలో పారిశ్రామిక వాడలు ఏర్పాటులో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. అందుకు సంబంధించిన స్థలం సేకరణ పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జిల్లాలోని కూడేరు పరిధిలో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం 353 ఎకరాలను సేకరించారు.

జడ్పీ నూతన సీఈఓగా రామచంద్రారెడ్డి



జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కలసిన కొత్త సీఈఓ, డిప్యూటీ సీఈఓ

అనంతపురం విద్య, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ నూతన సీఈఓగా రామచంద్రారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల డ్వామా పీడీగా పనిచేస్తున్న ఆయనను ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా నవంబరు నెలలో అనంతపురం జిల్లా సీఈఓగా నియమించారు. అయి తే దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో...అప్పట్లో విధుల్లో చేరలేదు. దీంతో డిప్యూటీ సీఈఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సెలవుల అనంతరం జిల్లాకు వచ్చిన ఆయన డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ బో య గిరిజమ్మను ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సీఈఓగా బాధ్యతలు తీసుకున్నారు. కొత్త సీఈఓను జిల్లా పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

ఎస్ఎస్‌బీఎన్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సాయిబాబా అనుగ్రహంతో పెరిగిన మహావృక్షమే ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు పేర్కొన్నారు. ఆ విద్యాసంస్థల 80 వార్షికోత్సవాలకు సంబంధించి శనివారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యాసంస్థ స్థాపించి 80 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో... అప్పటి అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత అధ్యాప కులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 3, 4, 5 తేదీలలో మూడ్రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు సంబంధించి భారీస్థాయి లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కావున పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించి దేశం నలుమూలల స్థిరపడిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఈ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి సుంకు వేణుగోపాల్, కోశాధికారి చంద్రశేఖర్‌గుప్త, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములపై కార్పొరేట్ల కన్ను: సీపీఐ



మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సోలార్, గాలిమరల పేరుతో రైతుల భూములను కాజేయడానికి అదానీ, కార్పొరేట్ శక్తులు కుట్రలు చేస్తున్నాయని సీపీఐ నాయకులు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ రైతుల భూములను 20 ఏళ్లకు లీజుకు తీసుకుని, వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకుని సోలార్, గాలిమరల కంపెనీలు ఏర్పాటు చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే 50 శాతం రాయితీలు కూడా తీసుకుంటారన్నారు. అనంతపురంలో జిల్లాలో పండే పండ్లను కార్గో విమానాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. హంద్రీనీవా కాలువను కూడా వెడల్పు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సోలార్, గాలిమరల కంపెనీలకు తమ భూములిచ్చి నష్టపోవద్దని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపేలా ప్రణాళిక సిద్ధం చేశాడన్నారు. దొంగే దొంగ అన్నట్లు ఇప్పుడేమో ఆయనే కరెంటు చార్జీలపై ధర్నాలు చేయడం ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే కూటమి ప్రభుత్వం కూడా చార్జీలు పెంచడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, ఇతర నేతలు నారాయణస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవో 77 రద్దు చేయాలి : విద్యార్థి సంఘాల నేతలు

పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్‌యూఐ, వైఎస్ఆర్‌సీపీ, ఏఐవైఎఫ్ తదితర సంఘాల నేతలు సీపీఐ ఆఫీస్‌లో సమావేశం నిర్వహించారు. నాయకులు కుళ్లాయిస్వామి, నరేష్, చంద్రశేఖర్, హనుమంతురాయుడు తదితరులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3580 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 30న విజయవాడలో దీక్ష జరుగుతుందని, విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు.

కుష్ఠును తొలిదశలో గుర్తిస్తే కట్టడి సులభం

జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు అనుపమ జేమ్స్

అనంతపురం టౌన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే వైకల్యం రాకుండా అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా కుష్ఠు నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శనివారం నెలవారి సమీక్ష నిర్వహించారు. ఇంటింటా సర్వే, కేసుల గుర్తింపు, చికిత్సలకు తీసుకున్న చర్యలు గురించి ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుష్ఠు అతి సాధారణమైనదని, ఈవ్యాధి ఏదశలో ఉన్నా ఆరునెలలు లేదా 12నెలలు మందులు వాడితే నయమవుతుందన్నారు. కానీ చాలామందికి దీనిపై అవగాహనలేక భయపడిపోతున్నారన్నారు. ఇంకొందరు బయటకు చెప్ప కుండా దాచిపెట్టుకుని తీవ్ర సమస్యగా తెచ్చుకుంటున్నారన్నారు. అందుకే ప్రభుత్వం ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి తగిన సమయంలో వైద్యం అందించి వ్యాధి నుంచి కాపాడాలనే సర్వే చేపడుతోందన్నారు. ఈసర్వేలో అనుమానపు లక్షణాలు మచ్చలు ఉన్నవారిని గుర్తించి, వారికి కుష్ఠు పరీక్షలు నిర్వహించా లన్నారు. ఒకవేళ కుష్ఠు అనే అనుమానం వస్తే వారు నిబంధనల మేరకు చికిత్స, మందులు వాడేలా చూడాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందన్నారు. ఈవిషయంలో పారామెడికల్ ఆఫీసర్లు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల లోనే ఉచితంగా మందులు ఇస్తారని, ఎక్కడా మందులు లేవనే మాటరాకుండా చూడాలన్నారు. బాధితులకు ప్రభుత్వం రూ.ఆరువేలు పింఛన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టరు గంగాధరరెడ్డి, డాక్టరు శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, సత్యనారాయణ, రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టరు అనుపమజేమ్స్

పీఎం ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోండి


జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని మాజీ సైనికులు... పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప సూచించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొ న్నారు. ఉమ్మడి జిల్లాలోని మాజీ సైనికులు తమ పిల్లల ఉపకార వేతనం కోసం సోమవారం నుంచి జనవరి 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరి న్ని వివరాలకు ఫోన్ నంబరు 08554-241146కు సంప్రదించాలన్నారు.

31న సినీగేయ వజ్రోత్సవ సదస్సు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో ఈ నెల 31న సినీగేయ వజ్రోత్సవ సదస్సును నిర్వహించనున్నట్లు పీఆర్వో ప్రొఫసర్ రామగోపాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నందమూరి తారక రామారావు నటించిన తొలిచిత్రం 'మన దేశం' విడుదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు. తెలుగు తులనాత్మక సాహిత్య శాఖ, మహాబోధి సాహిత్యశాఖ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేస్తే సదస్సుకు ముఖ్యతి అతిథిగా వర్సిటీ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి హాజరవుతారని తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు




జయసాయి

నార్పల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ పప్పూరుకు చెందిన ఆదినారాయణ, సరస్వతి దంపతుల కుమారుడు జయసాయి అనే యువకుడి ఆదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ శనివారం తెలిపారు. 18 సంవత్సరాలు వయస్సున్న జయసాయి చెవుడు, మూగ వాడన్నారు. వారం నుంచి కనిపించటం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతడి ఆచూకీ తెలిస్తే సెల్ ఫోన్ నంబర్లు 9849498492, 9966163496 సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కేశే. శంకరనారాయణ కాంచ్...

డాక్టర్ కువెంపు (జయంతి)



కన్నడ సాహిత్యంలో తొలి జ్ఞాన పీఠ పురస్కార గ్రహీత కుప్పళి వెంకటప్ప పుట్టప్ప (కువెంపు) 1904 డిసెంబరు 29న మైసూరులో జన్మించారు. కర్ణాటక రాష్ట్ర గీతమైన 'జయ భారత జననీయ తనుజాతె'ను ఆయనే రచించారు. రామాయణ ఇతిహాసాన్ని కన్నడలోకి రాశారు. నవలా రచయిత, కవి. మైసూరు యూనివర్శిటీ వీసీగా కన్నడ అధ్యయన సంస్థను ఏర్పాటు చేశారు. రాష్ట్రప్రభుత్వం ఆయన సేవలను గుర్తిస్తూ శివమొగ్గ జిల్లాలో కువెంపు యూనివర్శిటీ ఏర్పాటు చేసింది. 'పద్మ విభూషణ్' పురస్కారం ఇతర గౌరవాలు అందుకు న్నారు. 1994 నవంబరు 11న కన్నుమూశారు.

టీజీ కమలాదేవి (జయంతి)



టీజీ కమలాదేవి 1930 డిసెంబరు 29న చిత్తూరు జిల్లా కార్వేటి నగరంలో జన్మించారు. తెలుగు సినీ నటి, స్నూకర్ క్రీడాకారిణి, బిలియర్డ్స్ ఆడిన తొలి దేశ మహిళగా గుర్తింపు పొందారు. 1994లో ఓపెన్ బిలియర్డ్స్, స్నూకర్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజేతగా నిలిచారు. పాతాళభైరవి, మల్లీశ్వరి వంటి హిట్ సినిమాలలో నటించారు. కొన్ని పాటలు పాడడంతోపాటు తర్వాతికాలంలో అనేకమంది నటీనటులకు డబ్బింగ్ చెప్పారు. తెలుగుతోపాటు తమిళ సినిమాల్లో కూడా నటించారు. 2012 ఆగస్టు 16న కన్నుమూశారు.

సీ అశ్వథ్ (జయంతి, వర్ధంతి)



సీ అశ్వథ్ 1939 డిసెంబరు 29న జన్మించారు. కన్నడ సాహిత్యంలో సుగమ సంగీతం ద్వారా 75కుపైగా ఆల్బమ్స్ రూపొందించారు. గాయకుడు, స్వీయసంగీత స్వరకల్పనలో ఎన్నో పాటలు ఆలపించారు. నాటక, సుగమ సంగీతం, సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన ఘనత ఆయనది. రాజ్యోత్సవ పురస్కార గ్రహీత. 2009 డిసెంబరు 29న కన్నుమూశారు. ఇలా జయంతి, వర్ధంతి ఒకేరోజు రావడం గమనార్హం.

రాజేశ్ ఖన్నా (జయంతి)



బాలీవుడ్‌లో 15 సోలో హిట్ సినిమాలతో దేశ సినీరంగంలో తొలి 'సూపర్‌స్టార్'గా గుర్తింపు పొందిన రాజేశ్‌ఖన్నా 1942 డిసెంబరు 29న అమృత్‌సర్‌లో జన్మించారు. అసలు పేరు జతిన్ ఖన్నా. 1967లో 'ఆఖ్రీ ఖత్' సినిమా ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. 168 సినిమాలు, 12 షార్ట్ ఫిలిమ్స్‌లలో నటించారు. పద్మభూషణ్ పురస్కారం, 3 ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ నటుడు, 4 బీజేఎఫ్ఏ, ఇతర అవార్డులు పొందారు. ఎంపీగాను వ్యవహరించారు. 2012 జూలై 18న కన్నుమూశారు.

ఓలేటి వెంకటేశ్వర్లు (వర్ధంతి)



కర్ణాటక సంగీతవిద్వాంసులు ఓలేటి వెంకటేశ్వర్లు 1928 ఆగస్టు 27న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. రేడియో రంగ ప్రముఖులు. ఆయన నేతృత్వంలో ప్రసారమైన సంగీత రూపకాలు, యక్షగానాలు విజయవాడ రేడియో కేంద్రానికి దేశవ్యాప్తంగా కీర్తినార్జించిపెట్టాయి. భక్తిరంజని కార్యక్రమంలో త్యాగరాజ దివ్యనామ కీర్తనలు, రామదాసు కీర్తనలు వంటివి కర్ణాటకసంగీతంలోని బాణీని విడువకుండా సంప్రదాయశైలిలో పాడేవారు. 1989 డిసెంబరు 29న పరమపదించారు.

త్వరలో ఇళ్ల స్థలాల పంపిణీ: ఎమ్మెల్యే

బాగేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఘంటమవారిపల్లి గ్రామ పంచాయతీ కొడికొండ రోడ్డు వద్ద ఆశ్రయ లే అవుట్ మెయిన్‌రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నో ఏళ్లుగా స్థలాలు లేని పేదలు ఉన్నారని, ఇప్పటికే వెయ్యికిపైగా అర్జీలు వచ్చాయన్నారు. త్వరలోనే అర్జీలను పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు పాతబాగేపల్లి సమీపాన ఇంటిస్థలాలు కేటాయించనున్నట్టు తెలిపారు. కాగా సుమారు 25లక్షల రూపాయలతో సీసీడీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టి శుద్ధ తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. బాగేపల్లి, చేళూరు, గుడిబండ ఇలా మూడు తాలూకాలు కల్గిన నియోజకవర్గంలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల రోడ్లను బాగు చేస్తామన్నారు. తద్వారా అన్నివర్గాల ప్రజలకు, విద్యార్థులకు అనుకూలం కానుందన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు శ్రీనివాస్, స్థాయి సమితి అధ్యక్షుడు నంజుండప్ప, సభ్యులు శ్రీనివాసరెడ్డి, శభాన, ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు కేఆర్ నరేంద్ర బాబు, సీనియర్ ప్రముఖులు సోమశేఖర్, మన్సూర్, జేఈ సోమశేఖర్, కాంట్రాక్టర్ శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

అర్థవంతంగా శ్రమదానం

దొమ్మసంద్ర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర పట్టణ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఫెవికాల్ చాంపియన్ సంస్థ, సర్జాపుర చుట్టుపక్కల ఉన్న కార్పెంటర్‌ల సహకారంతో శ్రమదాన దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబడిన కుర్చీలు, డెస్క్‌లు, బ్లాక్ బోర్డులు, టేబుళ్లకు మరమ్మతు నిర్వహించి జీవం తెచ్చారు. సర్జాపుర గ్రామపంచాయతీ సభ్యుడు ఆర్ కిటికీ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజం మనకు ఎంతో ఇచ్చిందని మనం కూడా సమాజానికి ఎంతోకొంత సేవ చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాల, కళాశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించి అవసరమైన వస్తువులను బాగు చేయడం ద్వారా విద్యార్థులకు అండగా ఉండాలన్నదే ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా ఫెవికాల్ చాంపియన్ సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగం ముఖ్యులు ముదస్సర్ కిలారి మాట్లాడుతూ ఏటా ఫెవికాల్ ఛాంపియన్ క్లబ్ ప్రతి ఏడాది అనేక సమాజసేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. శనివారం 30మందికి పైగా కార్పెంటర్ల బృందంతో ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన పనులు సమకూర్చామన్నారు. బృందంలో ముబీనా ముసరత్, లింగరాజు, ఫెవికాల్ ఛాంపియన్ సంస్థ సంపత్‌రెడ్డి, కార్పెంటర్లు శ్రీనివాస్, మురగేశ్ ఆచారి, శృంగేరి, ఇంద్రపాల్, సాయిరాం, వెంకటేశ్, ములరాం, సుఖదేవ్, నాథూరాం తదితరులు పాల్గొన్నారు.



బృందంలో కార్పెంటర్లు తదితరులు

తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం తగదు

మహదేవపుర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వద్దని ఇటీవలికాలంలో వృద్ధాశ్రమాలకు పంపే పిల్లల మనోభావం మారాలని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. శనివారం గరుడాచార్‌పాళ్యలో సమాజ సేవకుడు అనంతరామయ్య నేతృత్వంలో తండ్రి మునివీరప్ప 32వ వార్షిక ఆరాధన గురుపూజలో మాజీ మంత్రి ఎంటీబీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుభజన, కళశస్థాపన, పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా లింబావళి మాట్లాడుతూ తల్లిదండ్రులే తొలి గురువు లని అయితే ఇటీవలికాలంలో వృద్ధాశ్రమాలలో చేరుస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చామరాజనగర జిల్లా హనూరు ఎమ్మెల్యే మంజునాథ్, స్థానిక ప్రముఖులు వెంకటస్వామిరెడ్డి, మహేంద్రమోది, ఎల్ రాజేశ్, అభిషేక్, అఖిలేశ్ తదితరులు పాల్గొన్నారు.



విశేషపూజల్లో మాజీ మంత్రులు లింబావళి, ఎంటీబీ నాగరాజ్ తదితరులు

ఘనంగా అయ్యప్పస్వామి ఉత్సవం

శిడ్లఘట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోక రోడ్డులో పురాతనమైన కాశీవిశ్వేశ్వరయ్య స్వామి ఆలయంలో అయ్యప్పస్వామి సన్నిధిలో శుక్రవారం విశేషపూజలు జరిగాయి. ఉదయం, సాయంత్రం స్వామివారికి క్షీరాభిషేకం, అలంకరణ అనంతరం ఉత్సవమూర్తిని పురవీధులలో ఊరేగించారు. దేవుడి స్థిరబింబానికి 101 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించారు.



పురవీధులలో అయ్యప్ప ఊరేగింపు

నేరాల నియంత్రణపై అవగాహన

బెంగళూరు మెట్రో, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కల్యాణనగర్‌లోని ట్రూలైఫ్ ఆసుపత్రిలో సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించే చర్చాగోష్ఠిని బెంగళూరు నగర పోలీసులు నిర్వహించారు. బాణసవాడి పోలీస్‌స్టేషన్ ఏసీపీ ఉమాశంకర్, బెంగళూరు తూర్పు సైబర్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ లక్ష్మీకాంత్, సీఐ అరుణ్ సోలంకిలు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని వీటిని అధిగమించేందుకు ప్రజలను చైతన్యం చేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 2024లో 20,875 కేసులు నమోదయ్యాయని రూ.2,047 కోట్లు నష్టపోయారన్నారు. బెంగళూరులో నవంబరు వరకు 16,35కేసులు నమోదయ్యాయన్నారు. ఇటీవలికాలంలో డిజిటల్ అరెస్టు పేరిట మోసాలకు పాల్పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడమే మోసాల నియంత్రణ సాధ్యమన్నారు. ఏసీపీ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ఆన్‌లైన్ లావాదేవీల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సరైన యాంటివైరస్‌తోపాటు తగిన అప్‌డేట్ పాటించాలన్నారు. స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు వినియోగించాలన్నారు. గుర్తు తెలియని లింక్‌లపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ట్రూలైఫ్ హాస్పిటల్ సీఈఓ, సహసంస్థాపకులు డాక్టర్ షఫీక్ మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.



ఏసీపీ ఉమాశంకర్, లక్ష్మీకాంత్ తదితరులు

మాజీ ఎమ్మెల్యేపై కేసు

ఉరవకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో పాటు మరో 16 మంది వైసీపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నాయకులు అనుమతులు తీసుకోకుండా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారని, ఆ శాఖ అధికారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గోవిందు, వైసీపీ నాయకుల ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు కలిగాయని ఫిర్యాదు చేశారు.

కార్మికశాఖ ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్య, ఆర్థికంగా వెనుకబడినవర్గాలకు రాష్ట్ర, కేంద్రప్రభుత్వాల పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో కార్మికశాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్, వెల్డింగ్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. కార్మికులకోసం ఎన్నో సంక్షేమాలు ఉన్నాయని అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకాల అమలుకు సంబంధించి అధికారులు తగిన చొరవ చూపాలన్నారు. ఒక పథకం అమలుకు కోట్లాదిరూపాయలు ఖర్చు అవుతాయని ఇది ప్రజల పన్నుల సొమ్ము అని వృథా కారాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు బీఎన్ స్వామి, తాలూకా పంచాయతీ కార్యనిర్వాహక అధికారి హేమావతి, జిల్లా జాగృతి సమితి సభ్యుడు మేలూరు మంజునాథ్, నవీన్, కార్మికశాఖ అధికారి విజయలక్ష్మి, తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

15 ఏళ్ల బాలుడికి అరుదైన చికిత్స

బెంగళూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో అరుదైన వ్యాధితో బాధపడుతున్న 15ఏళ్ల బాలుడికి రెయిన్‌బో ఆసుపత్రి వైద్యులు చికిత్సల ద్వారా జీవం పోశారు. చాపెల్ (కాంప్లిమెంట్ హైపర్ యాక్టివేషన్ యాంజియోపతిక్ థంబ్రోసిస్ ప్రొటీన్ లోసిన్ ఎంట్రోపతి) వ్యాధితో మూడేళ్లుగా బాధపడుతున్న బాలుడికి అమెరికా నుంచి అత్యవసరమైన మందులు తెప్పించి చికిత్సలు అందించారు. ప్రపంచవ్యాప్తంగా వందమందిలోపు ఇటువంటి అరుదైన వ్యాధితో ఇబ్బందిపడేవారు ఉన్నారని రెయిన్‌బో వైద్య నిపుణులు లావణ్య ఆర్‌పి తెలిపారు. అమెరికా నుంచి మందులు తెప్పించి నిరంతర పర్యవేక్షణతో చికిత్సలు అందించామన్నారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడని తండ్రి కృష్ణమూర్తి తెలిపారు.

నాసిరకం ట్రాక్టర్ ఇచ్చారని..
అన్నదాత ఆత్మహత్యాయత్నం

బెంగళూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నాసిరకం ట్రాక్టర్ ఇచ్చారని షోరూం వద్దనే ట్రాక్టర్‌పై డీజిల్ పోసి రైతు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శివమొగ్గ జిల్లా రిప్పన్‌పేటలో శుక్రవారం చోటుచేసుకుంది. జాన్‌డీర్ ట్రాక్టర్ షోరూంలో కారగడి సమీపంలోని మండళ్ళి నివాసి లక్ష్మీనారాయణ అనే రైతు ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఐదేళ్ల గ్యారెంటీ గడువు ఉంది. అయినా సర్వీస్‌తోపాటు విడిభాగాలకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ రైతులు కర్ణాటక కార్మిక పరిషత్ సహకారంతో ఆందోళన చేశారు. రెండేళ్లక్రిందట కాళె అగ్రిటెక్‌లో జాన్‌డీర్ ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. మూడోరోజునే చక్రంలో సమస్య తలెత్తింది. షోరూం నిర్వాహకులకు తెలిపితే గ్యారెంటీ ఉందని మరమ్మతు చేయిస్తామని హామీ ఇచ్చారు. అయితే నిరంతరంగా ట్రాక్టర్ రిపేర్లకు వస్తోంది. అయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. సర్వీస్‌కోసం వెళ్తే రూ.70వేలు చెల్లించాలని లేదంటే రిపేరీ చేయమని తేల్చిచెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతు లక్ష్మీనారాయణ ట్రాక్టర్‌తో నేరుగా షోరూం వద్దకు చేరుకున్నారు. ట్రాక్టర్‌పై డీజిల్ పోసి ఒంటిపైనా పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే స్థానికులు అడ్డుకున్నారు. ఈలోగా సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ అక్కడికి చేరుకుని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రైతును నచ్చచెప్పారు.

నేటి నుంచి బ్యాటరాయస్వామి జాతర


బంగారపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవుడి జాతరలు ఒక ప్రముఖ పరంపర అని ప్రతిఏటా ప్రజల సుభిక్షంకోసం ధార్మిక కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని డీకే హళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు సురేశ్ తెలిపారు. తాలూకాలోని డీకే హళ్ళిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తుల కొంగుబంగారంగా ఉన్న బ్యాటరాయస్వామి జాతర వారం రోజులపాటు కొనసాగుతుందని బ్రహ్మరథోత్సవం ఉంటుందన్నారు. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాది ఎమ్మెల్యే గ్రాంట్ల సాయంతో కొండకు సీసీ రోడ్డు నిర్మించామని, ప్రస్తుతం గ్రామ పంచాయతీ సహకారంతో తాగునీరు, విద్యుత్ దీపాలు కల్పించామన్నారు. రానున్నరోజుల్లో ఆలయ సమగ్ర అభివృద్ధికి పాటుపడతామన్నారు. 28న కళశస్థాపన, ధ్వజారోహణ, 29న కల్యాణోత్సవం, 30న బ్రహ్మ రథోత్సవం, 31న సూర్యప్రభ ఉత్సవం, జనవరి 1న వసంతోత్సవం ఉంటాయన్నారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

గోతిలో పడ్డ కారు.. ముగ్గురి దుర్మరణం



పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బెంగళూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి గోతిలో పడ్డంతో ముగ్గురు దుర్మరణం చెందిన సంఘటన దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు తాలూకా పర్లడకలో చోటు చేసుకుంది. శనివారం తెల్లవారుజామున 4.15 గంటలకు ప్రమాదం చోటు చేసుకుంది. కారు సుళ్యనుంచి పుత్తూరు వైపు వెళ్తున్న కారు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడమే కారణమంగా తెలుస్తోంది. సుళ్య తాలూకా జట్టిపళ్ల నివాసులైన అణ్ణునాయక్, చిదానంద, రమేశ్ నాయక్‌లు మృతి చెందినవారు. పుత్తూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.22	1,589.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	453	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,895	779
నీటి నిల్వ (టీఎంసీలు)	83.99	10.48

సామూహిక దాడి.. వ్యక్తి మృతి

రాయచూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మస్కి తాలూకా సొసైటీ క్యాంప్‌లో జరిగిన సామూహిక దాడిలో వ్యక్తి ఒకరు మృత్యువాతపడ్డారు. మృతి చెందిన వ్యక్తి క్యాంపులోని రాజప్ప(41)గా గుర్తించారు. అదే క్యాంపునకు చెందిన ఏడుగురు వ్యక్తులు రాజప్ప పై మారణాయుధాలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన రాజప్పను కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజప్ప మృతి చెందారు. కవితాళ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా ఆలంబాషా తాత ఉరుసు

సిరుగుప్ప, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : దడేసూగూరు ఆలంబాషా తాత ఉరుసు మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. సిరుగుప్ప, సింధనూరు తాలుకాలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన ఆలయం బాషా ఉరుసును ఏటా నిర్వహించడం ఆనవాయితీ . మూడు రోజులు జరగనున్న ఉరుసులో శుక్రవారం రాత్రి ఖవాలీ కార్యక్రమం జరిగింది. భక్తులు తాత వారికి పూలు, పండ్లు, సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బళ్లారి, కొప్పళ, రాయచూరు, హైదరాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

గుంతలోకి దూసుకుపోయిన బస్సు

రాయచూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కందకంలోకి కూరుకుపోయిన ఘటన శనివారం ఉదయం జిల్లాలోని హట్టి బంగారు గనుల సమీపంలోని పైదొడ్డి క్రాస్ వద్ద చోటు చేసుకుంది. హావేరి నుంచి కలబుర్గివైపు వెళ్తున్న ఈ బస్సుకు గొర్రెల మందు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమంలో డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశారు. దీంతో ఒక్కసారిగా బస్సు రోడ్డు పక్కలోని కందకంలోకి ఒరిగిపోగా సగం బస్సు రోడ్డు పైకి నిలిచిపోవడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో దాదాపు 40 మందికిపైగా ప్రయాణికులున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ప్రమాదానికి గురైన బస్సు

కష్టాల్లో వేరుశనగ రైతు

● పెట్టుబడి కూడా చేతికి రాదని అన్నదాత దిగాలు

బళ్లారి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆశల సాగుతో రైతు ఏటా నష్టపోతున్నారు. భూమిని నమ్ముకుంటే లాభాలు రాకపోతాయా అన్న ఆశతో మొండిగా వ్యవసాయం చేస్తూనే ఉన్నారు. అయితే అన్నదాతకు ఆవేదనే మిగులుతోంది. వేరుశనగ రైతు మరోసారి నష్టాల్లో కూరుకుపోయారు. గతేడాది వేరుశనగ రేటు క్వింటాల్ రూ. 20 వేల దాకా ఉంటే ఇప్పుడు కేవలం 10 వేల వరకూ ఉండడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ పంటను ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం అమ్మకానికి ఏపీఎంసీకి తరలిస్తున్నారు. బళ్లారిలోని ఏపీఎంసీకి బళ్లారి, తదితర ప్రాంతాల తో పాటు అనంతపురం, కర్నూలు జిల్లాలోని పలు గ్రామాల రైతులు వేరుశనగ పంటను అమ్ముకునేందుకు తెస్తున్నారు. ధరలు పూర్తిగా పడిపోయాయి. క్వింటాల్ సరాసరి రూ. 10 వేల వరకైనా పలకడం లేదని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు మరింత ధరకు కొనుగోలు చేస్తున్నారని వారు వాపోతున్నారు. రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని దిగులు చెందుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా చేతికి అందకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని గిట్టుబాటు ధర ప్రకటించాలని వారు కోరుతున్నారు.



కళ్లాల్లో వేరుశనగను ఆరబోసిన రైతులు

సవిత సమాజాభివృద్ధికి యువత కృషి చేయాలి

●సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎంసీ బాలు



బ్రోచర్లు విడుదల చేస్తున్నఎంసీ బాలు, సంఘం నాయకులు

రాయచూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సామాజికంగా సవిత సమాజం అత్యంత వెనకబడిన వర్గమని ఈ సమాజం అభ్యున్నతి కోసం యువత మరింత ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని సవిత సమాజం రాష్ట్ర గౌరవధ్యక్షుడు ఎంసీ బాలు సూచించారు. సవిత సమాజానికి చెందిన రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కో-ఆపరేటివ్ బ్యాంక్ ఐదవ వార్షికోత్సవాన్ని శనివారం నగరంలోని కన్నడ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంసీ బాలు, పదవి విరమణ చేసిన ఉద్యోగులు పరస్పర ఆర్థిక సహకారం కోసం కులబాంధవులకు తోడ్పాటునందించేందుకు సొసైటీని నిర్వహించడం అభినందనీయమన్నారు

ఆకట్టుకుంటున్న రాతి బండి..

బళ్లారి సిటీ,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్లీపురం మహాదేవతాత మఠంలో నూతనంగా అమర్చిన రాతి బండి భక్తులను ఆకట్టుకుంటోంది. నగరానికి చెందిన హరీష్ అనే భక్తుడు చెన్నపట్టణ తాలూకా సుణ్ణదమట్టద కళాకారుడిచే దీనిని సిద్ధపరిచారు. ఎడ్ల బండి నగర ప్రాంతంలో ఆధునికతతో కనిపించడం విశేషంగా కనిపిస్తోంది. మరికొద్దిరోజుల్లో జోడు ఎద్దుల విగ్రహాలు కూడా రూపొందిస్తామని మఠం పాలక యంత్రాంగం ప్రకటించింది.



ఆలయంలో రాతి బండి

వంతెన మరమ్మతుతో ఇబ్బందులు

తోరణగల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంవత్సరాలు గడిచినా పూర్తి కాని అండర్ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సండూరు తాలుకా కురేకుప్ప పుర సభ పరిధిలో బసాపురం, వడ్డు గ్రామాల వైపున రైల్వే లైన్ వుంది. దాదాపు ఈ లైన్‌లో ప్రతి అరగంటకు ఒక రైలు వస్తూ వుంటుంది. రైల్వే గేటు బంద్ చేయడం వలన వాహనదారులకు పలు ఇబ్బందులు కలుగుతూ వుండటం వలన వాహనదారులకు కింద అండర్ బ్రిడ్జి ద్వారా వాహనాలు నడపాలని ఆలోచనతో బ్రిడ్జి ప్రారంభించడం జరిగింది. కానీ ఇంకా సంవత్సరాలు గడిచినా పూర్తి కావడం లేదు దీంతో వాహన దారులకు రైతులకు అటువైపు ఉన్న ఊరి వారికి బాల విద్యార్థినీ విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనీసం చిన్న వాహనదారులకైనా దారి చేయలేదని ప్రజలు వాపోతున్నారు. వాహనదారులకు దారి కల్పించి బ్రిడ్జిని పూర్తి చేయాలని పట్టణ ప్రముఖులు రుద్రేష్, సురేష్, రామన్న, రఘు, రామాంజనేయ మొదలగు వారు కోరుతున్నారు. మూడు నాలుగు నెలల్లో బ్రిడ్జిని పూర్తి చేస్తామని అంటున్నారు.



నడిచి వెళ్తున్న విద్యార్థులు



పూర్తికాని అండర్ బ్రిడ్జి పనులు



ఆర్‌వై ఎంఈసీ లో మాట్లాడుతున్న మేయర్ నందీష్‌బాబు

ఆహా.. ఆరోజులే వేరప్పా..!

● ఆర్‌వైఎంఈసీలో పాతికేళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక
● జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడి చేసిన ప్రముఖులు

బళ్లారి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏరా ఎలావున్నావ్..ఎక్కడ ఉన్నావ్.. ఎన్నాళ్లయింది నిన్ను చూసి.. అంటూ ఆప్యాయంగా పలకరింపులు, ఒకరి చేతిలో చేయి వేసి భుజాల పై చేయి వేసి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకుంటూ ఆనందగా గడిపారు. సుమారు 25 ఏళ్ల తరువాత కలిసిన వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. బళ్లారిలోని ప్రతిష్ఠాత్మకమైన రావ్ బహుద్దూర్ వై.మహాబలేశ్వరప్ప కాంతిక విద్యాలయం (ఆర్‌వైఎంఈసీ)లో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం సందడిగా జరిగింది. సుమారు 2వేల మందికి పైగా పాత విద్యార్థులు కలయిక జరిగింది. ఇక్కడ చదువుకుని దేశవిదేశాల్లో స్థిరపడిన వారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన వారు ఇలా అనేక మంది కలుసుకున్నారు. ముఖ్య అతిథులుగా ఆర్‌వైఎంఈసీ సంఘం అధ్యక్షుడు, సంఘం సభ్యులతో పాటు బళ్లారి మేయర్ ముల్లంగి నందీష్ బాబు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎమ్మెల్యేలు కోణా రవికుమార్, కందుల నారాయణరెడ్డి, తదితరులు హాజరయ్యారు.



మాజీ ప్రధానికి నివాళి అర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉత్తర కర్ణాటక ప్రజల జీవనాడి ఆల్మట్టి

బళ్లారి సిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక ప్రజల జీవితాలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిర్మించిన రిజర్వాయర్ ఆల్మట్టి అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. శనివారం తాలూకలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో ఆలమట్టి తుంగభద్ర రిజర్వాయర్‌ల గురించి విద్యార్థుల ప్రసంగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్మట్టి డ్యాం 160అడుగుల ఎత్తు, 130టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందన్నారు. దీనిని 2005లో బీజాపూర్ జిల్లాలోని ఆలమట్టి దగ్గర కృష్ణానదికి అడ్డంగా నిర్మించారని, ఎందరికో సాగు, తాగు నీరందిస్తోందన్నారు. 2010లో అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం దీన్ని అవిష్కరించి ప్రపంచానికి అంకితం చేశారు. ఇక్కడ ఏడు టెర్రస్ తోటలు, రాక్ హిల్ అనే కృత్రిమ అడవిని నిర్మించారన్నారు. అనంతరం తరగతిలో ప్రతిభ కనబరిచన విద్యార్థులకు బహుమతి పంపిణీ చేశారు.ఈసందర్భంగా విద్యార్థులుం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం



అధ్యక్ష ఉపాధ్యక్షులను అభినందిస్తున్న సభ్యులు

కంప్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని శ్రీరామరంగాపురం (సుగ్గినల్లి కొట్టాల)లో కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్ష ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. 12 మంది సభ్యులకు గాను అధ్యక్ష స్థానానికి వెంకట్రాముడు, ఉపాధ్యక్ష స్థానానికి యల్లప్పలు నామినేషన్ వేశారు. పోటీలో ఎవరూ లేనందున వారి ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి హనుమంతప్ప తెలిపారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు, పది మంది తోటి సభ్యులకు గ్రామంలోని పలువురు నాయకులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య, పుల్లయ్య, వెంకటేష్, బోయపాటి విష్ణు, నాగభూషణ, రాఘవేంద్ర, ఆనంద్, పోలప్ప శ్రీరామరంగాపురం, సుగ్గినల్లి, వన్నళ్లి, మానళ్లి తదితరులు పాల్గొన్నారు.

దరోజీ సొసైటీలో పోటాపోటీ సభ్యుడి ఎన్నిక

తాలుకా పరిధిలోని కొత్త దరోజీలో కృషి పత్తిన సహకార సంఘం పరిశిష్ట జాతి రిజర్వేషన్ సభ్యుడి స్థానానికి ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. సభ్యుడు స్థానానికి మర్రిస్వామి, హనుమంతు, పోటీపడగా ఈ ఎన్నికల్లో 843 ఓట్లు వుండగా మర్రిస్వామికి 343, హనుమంతుకు 249 ఓట్లు పడగా 104 ఓట్లతో మర్రిస్వామి గెలుపొందినట్లు ఎన్నికల అధికారి గంగాధర తెలిపారు. జనార్దన, మారెప్ప, లింగప్ప, కార్యదర్శి యర్రిస్వామి, రామాంజిని, మలియప్ప తదితరులు వారిని అభినందించారు.

కృషి సమాజ తాలుకా పదాధికారుల నియామకం

తాలుకా వ్యవసాయ శిక్షణ కేంద్రం సమాజ తాలుకా పదాధికారుల నియామకం శనివారం జరిగింది. అధ్యక్షుడిగా నారాయణప్ప, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా సోమశేఖర్, కోశాధికారిగా నీలకంఠప్ప, జిల్లా ప్రతినిధిగా దొడ్డ బసప్పలు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి అభిలాష తెలిపారు.

అమాయకుల ప్రాణాలు తీసిన అక్రమ రవాణా..!

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అక్రమ బియ్యం రవాణా వ్యాపారం మరో ఇద్దరిని పొట్టన పెట్టుకుంది. ప్రమాదంలో రంగస్వామి(40), పరమేష్ (32) అనే ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... కురుగోడు తాలూకా పరిధిలోని చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి సేకరించిన బియ్యాన్ని మినీ లగేజీ వాహనంలో తరలిస్తున్నారు. శుక్రవారం రాత్రిత వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. ఘటన జరిగిన సమయంలో డ్రైవర్‌తో పాటు వాహనం లోడ్ చేసి బియ్యం బస్తాలపై నలుగురు యువకులు ఉన్నారు. ఇద్దరు యువకులు వాహనంపై బియ్యాన్ని కప్పిన టార్పాలిన్ కప్పుకుని నిద్రిస్తుండగా, మరో ఇద్దరు మెలకువలో ఉన్నారు. ప్రమాదం జరగగానే వాహనం రోడ్డుకు ఎడమవైపు కాలువ నీటిలో పడిపోయింది. నిదిస్తున్న వారిపై బియ్యం బస్తాలు పడ్డాయి. ఊపిరాడక వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకోగా, వెనుకవైపు కూర్చున్న మరో ఇద్దరు యువకులు చిన్నపాటి గాయాలతో ప్రాణాలతో బతికి బయట పడ్డారు. ఘటన రాత్రి జరగడంతో బయటకి పొక్కలేదు. ప్రమాదం నుంచి తప్పించుకున్న డ్రైవర్ బియ్యం వ్యాపారికి సమాచారం చేరవేశారు. హుటాహుటిన మరో వాహనాన్ని ఘటనా స్థలానికి తీసుకొచ్చి జేసీబీ సాయంతో వాహనాన్ని తొలగించి బియ్యం బస్తాలను ఇతర ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. మృతి చెందిన కూలీల మృతదేహాలను ఎవరికి అనుమానం రాకుండా మరో వాహనంలో తరలించారు. ఘటన రాత్రి జరగడంతో ఎవరికీ తెలియరాలేదు.... ప్రమాదం జరిగిన ప్రాంతం...చిమ్మచీకటి... ఆ సమయంలో ఆ రోడ్డులో వాహన సంచారం అంతంత మాత్రమే కావడంతో వ్యాపారులు గుట్టుగా తరలించినట్లు తెలుస్తోంది. ఇద్దరి మృతదేహాలను బళ్లారి బీఎంసీఎస్‌లోని మార్చురీ వద్దకు తీసుకొచ్చి వాహనాన్ని వదిలేసి వెళ్ళినట్లు తెలుస్తోంది..

గాయపడిన వారిని వారే విమ్స్‌లో చేర్పించారు. విషయం ఆలస్యంగా కురుగోడు గ్రామ ప్రజలకు తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయం ఆనోట... ఈ నోట పడడంతో ఘటనా స్థలానికి చేరుకున్న కురుగోడు పోలీసులు మృతదేహాలు గా... గాయపడిన వ్యక్తులు గాని, వాహనం డ్రైవర్ గాని ఘటనా స్థలంలో లేకపోవడంతో అయోమయానికి గురయ్యారు. స్థానికులతో ఆరా తీశారు. కురుగోడు గ్రామానికి చెందిన ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు గ్రామానికి చెందిన ఉజ్జలపేట నివాసులైన ఎర్రిస్వామి, ఉమేష్ అనే ఇద్దరు ఈ ప్రాంతంలో పేదలకు పంపిణీ చేసిన బియ్యాన్ని అక్రమంగా బ్లాక్‌మార్కెట్ తరలించే వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. బియ్యం అక్రమ రవాణా వ్యాపారుల పనిగా ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించుకున్నారు. అయితే ప్రమాదంపై కురుగోడు పోలీసు స్టేషన్‌లో శనివారం సాయంత్రం వరకు కేసు నమోదు కాలేదు. బియ్యం వ్యాపారికి స్థానిక నేతల అండదండలు ఉండడంతో అక్రమ బియ్యం కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుపుతూ స్థానిక పోలీసులపై రాష్ట్ర స్థాయి నాయకులతో పాటు, జిల్లా స్థాయి పోలీసు అధికారుల నుంచి ఒత్తిడి తీసుకొస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం...

సంచలనం రేపిన హత్య...

బియ్యం అక్రమ రవాణా ఘటనలు ప్రమాదాలు, హత్యలకు దారి తీస్తున్నాయి. బళ్లారి నగరంలో 2022, సెప్టెంబరు నెలలో కుంటి మంగజు అనే బియ్యం వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. అక్రమ బియ్యం వ్యాపారస్తుల మధ్య తలెత్తిన వివాదాల కారణంగా కుంటి మంజును హత్యచేసినట్లు అప్పట్లో పోలీసుల విచారణలో బయట పడింది. పేదలకు అందాల్సిన బియ్యాన్ని వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించే విషయంలో తలెత్తిన వివాదాల కారణంగా మంజును హత్య చేసినట్లు విచారణలో బయటపడింది. హత్య దృశ్యాలు సమీపంలోని ఓ హాస్పిటల్‌కు చెందిన సీసీ కెమారాలో రికార్డు కావడంతో...కౌల్ బజార్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ హత్య తరువాత బియ్యం అక్రమ వ్యాపారులు మకాం మార్చారు. బళ్లారిని వదిలి కురుగోడు, మోకా లాంటి ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నట్లు సమాచారం. బళ్లారి తాలూకా చుట్టుప్రక్కల నుండి సేకరించిన బియ్యం గంగావతి చేరుకుని అక్కడి నుండి జాతీయ రహదారులపై ఎవరికీ అనుమానం రాకుండా తుమకూరుకు చేరుస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన కొంతమంది యువకులు ఉపాధి లేక రాత్రి వేళల్లో ఇలాంటి పనులు చేస్తే కూలి ఎక్కువగా వస్తుందని ఆశపడి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. అక్రమ బియ్యం రవాణా సమయంలో పొరపాటున పోలీసుల చేతికి చిక్కితే... అమాయకులు కేసులో ఇరుక్కుంటున్నట్లు గ్రామీణ ప్రాంతలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



బోల్తా పడిన బియ్యం తరలింపు వాహనం



మృతి చెందిన కూలీలు

విద్య, మానవత్వం కాపాడటమే ఏఐడీఎస్ఓ లక్ష్యం

● జిల్లా కార్యదర్శి మంజునాథ్



మాట్లాడుతున్న కార్యదర్శి మంజునాథ్ తదితరులు

బళ్లారి సిటీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏఐడీఎస్ఓ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా నగరంలోని ఆర్ఎంఈసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 'దిలెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్' చిత్రం యొక్క మిషన్, ప్రదర్శనపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లాకార్యదర్శి మంజునాథ్ మాట్లాడుతూ విద్య-మానవత్వం సంస్కృతిని కాపాడేందుకు, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ఏఐడీఎస్ఓ వ్యవస్థాపక దినోత్సవాన్ని గౌరవప్రదంగా జరుపుకుంటున్నట్లు జిల్లాకార్యదర్శి మంజునాథ్ తెలిపారు దేశవ్యాప్తంగా 30కంటే ఎక్కువ రాష్ట్రాల్లో సంఘం పని చేస్తోందన్నారు. నేడు విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్ని మౌలిక సమస్యలపై పోరాడేందుకు నేల స్థాయి నుండి గొప్ప భావజాలం ఆదారంగా విద్య-మానవత్వం- సంస్కృతిని కాపాడేందుకు ఉద్యమాన్ని చేపడ్తామన్నారు. దేశవ్యాప్తంగా ఎన్ఈపీ 2020 నిరోధించేందుకు, ప్రభుత్వ విద్యను కాపాడేందుకు అందరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి బిడ్డకు ఉన్నత విద్య వరకు ఉచితి విద్య కోసం పోరాడిన భగత్‌సింగ్ ,సుభాస్ చంద్రబోస్ కలలు కలగానే మిగిలిపోయాయి.వారి కలలను నిజయం చేయడం మన చేత్తుల్లోనే ఉందన్నారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ బాధ్యతను మరింత పదును పెట్టేందుకు వ్యవస్థాపక దినోత్సవం రోజున ప్రతిజ్ఞ చేద్దామన్నారు. జిల్లాలో కూడాబలమైన సంస్థనపు నిర్మించడమే ధ్యేయమన్నారు. సమావేశంలో ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు ఈరన్న, ఉపాధ్యక్షురాలు శాంతి, ఉమా, కార్యాలయం కార్యదర్శి నిహారికి, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

విజయకాంత్‌కు ఘన నివాళి



అన్నదానం చేస్తున్న డీఎండీకే పార్టీ కార్యకర్తలు

హోసూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే పార్టీ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయకాంత్ తొలి వర్ధంతి సందర్భంగా హోసూరులో శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హోసూరు సిప్‌కాట్ రాజేశ్వరీ లేఅవుట్ సర్కిల్‌లోని విజయకాంత్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో శరవణన్, కేప్టెన్ సంగం అరవింద్, యూనియన్ పార్టీ డిప్యూటీ సెక్రటరీ శరవణన్, బ్రాంచ్ మేనేజర్ కాలియప్పన్, ప్రభాకర్, శరవణన్, గోవిందన్, కలాంబాయ్, సయ్యద్, సుబ్బరాయన్, నరసింహన్, మానిక్కం, అరివళగన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా సీతారామ కల్యాణం

హోసూరు డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి 34వ ఆరాధన రెండు రోజులపాటు జరిగింది. హోసూరు అనూష పూజామండలి ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమాలలో గురువందన, గణపతి హోమం, ఏకాదశ రుద్రాభిషేకం, వేదపారాయణతో పాటు సంప్రదాయబద్ధంగా శంకరాచార్యుల ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు. తీర్థనారాయణ పూజ అనంతరం నారాయణపూజ, కన్యాపూజ, లలితా సహస్రనామ పారాయణ, విష్ణుసహస్ర నామ పారాయణ నిర్వహించగా మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. కృష్ణమూర్తి భాగవతర్ బృందంచే ప్రత్యేక భక్తి భజన పాటలతో నామ సంకీర్తన నిర్వహించారు. సీతాకల్యాణంలో సంప్రదాయం ప్రకారం వస్త్రదానం నిర్వహించారు. ప్రధాన ఘట్టమైన తిరుమాంగల్యధారణ వైభవంగా జరిగింది. భక్తులు భక్తి పారవశ్యంతో కీర్తనలుచ విరలుని నృత్యాలతో దివ్యనామ భజనలు చేశారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

హోసూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ విద్యార్థినికి జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) హోసూరు విభాగం ఆధ్వర్యంలో హోసూరు రాంనగర్‌లో నిరసన నిర్వహించారు. హరినంత అధ్యక్షత వహించారు. యూనియన్ మాజీ కార్యదర్శి నాగబాబు, యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఇల్లాసనన్, జిల్లా మాజీ కార్యదర్శి రవి, పలువురు యువజన సంఘం నిర్వాహకులు పాల్గొన్నారు. నిరసనలో పాల్గొన్న 20 మందికి పైగా అరెస్టు చేశారు. ఘటనను సీఐటీయూ అధ్యక్షులు ఖండించారు. వాసుదేవన్, ఉపాధ్యక్షులు మూర్తి, శ్రీనివాసన్ మాదర్ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి జేమ్స్ ఏంజెలా మేరీ అరెస్టును ఖండించారు.



నిరసనలో డీవైఎఫ్ఐ కార్యకర్తలు తదితరులు